జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్

కుషాయిగూడ: చర్లపల్లి సీఐఏ ఆడిటోరియంలో ఎస్‌జీ ఫౌండేషన్, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీయువకులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. ఈ జాబ్‌మేళాలో చర్లపల్లి పారిశ్రామవాడకు చెందిన సుమారు 100 కంపెనీలు పాలుపంచుకున్నాయి. అనంతరం 300 మంది ఉద్యోగం వచ్చిన వారికి ఆయన చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు. సీఐఏ అధ్యక్షులు డాక్టర్ కె.గోవిందారెడ్డి, ఎస్‌జీ ఫౌండేషన్ ఫౌండర్ సుధాకర్ ఘంఢి, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జాబ్‌మేళా ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, రోషిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వేంకటేశ్వర్‌రెడ్డి, రాము, శ్రీనివాస్, కిషోర్‌కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన



ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సిద్ధ నాట్య కళాసమితి ఆధ్వర్యంలో నాదం, ఊతుకాడు వెంకట కవి రచించిన సంకీర్తనలకు కళాకారుల నృత్యంతో మెప్పించారు. ప్రాణవాకారం, జటాధర, కళింగ నర్తన, సకలలోక, మాధవ హృదయ, కల్యాణ రామ, తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కళాశ్రీ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర, డా. రమాదేవీలు హాజరై కళాకారులను అభినందించారు.

ముగుస్తున్న గడువు !



ఓటీఎస్ ఇచ్చినా అంగీకరించని వినియోగదారులు

- మరికొద్ది రోజులు గడువు కావాలని డిమాండ్
- 31తో ముగియనున్న వన్‌టైం సెటిల్‌మెంట్

ఉప్పల్: నల్లా బిల్లుల బకాయిలను చెల్లించడానికి వీలుగా బకాయిదారులకు ప్రభుత్వం వన్ టైం సెటిల్ మెంట్ (ఓటీఎస్)ను అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఆయిన కూడా వినియోగదారుల నుంచి స్పందన లేక పోవడం గమనార్హం. దీనికి సరైన కారణాలు లేకపోలేదు. స్కీమ్‌ను వినియోగదారులకు చేరవేయడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి.

సమాచార లోపంతో..

ఇప్పటివరకు చాలా మంది వినియోగదారులకు ఈ స్కీమ్ గురించి తెలియక పోవడం సమాచారం లోపమేననే విమర్శలున్నాయి. స్కీమ్ గడువు ఈనెల 31వ తేదీ వరకు ఉండటంతో మరికొద్ది రోజులు గడువు కావాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్కీమ్ గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించాలని జలమండలి అధికారులు కోరుతున్నారు.

కేవలం రూ.కోటి 20 లక్షలు మాత్రమే..

ఇప్పటి వరకు రూ. కోటి 20 లక్షలు మాత్రమే ఓటీఎస్ ద్వారా చెల్లించారని, జీఎం చెబుతున్నారు. ఇప్పటికైనా బకాయిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు.

మొత్తంగా 8 సెక్షన్‌లు..

ఉప్పల్ జలమండలి డివిజన్ 14 పరిధిలో మొత్తం 8 సెక్షన్లు ఉన్నాయి. రాధిక, హౌసింగ్ బోర్డు, సాయిబాబానగర్, చర్లపల్లి, నాచారం, హబ్సిగూడ, ఉప్పల్, రామంతాపూర్‌లు ఉన్నాయి. 8 సెక్షన్లలో మొత్తం 77,083 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. అందులో ఓటీఎస్ పరిధిలోకి వచ్చే కనెక్షన్లు 33,762. అంటే సగానికి పైగా వినియోగదారులు బిల్లులను చెల్లించడం లేదనే అర్థం. వీరిలో ఇప్పటివరకు కేవలం 1826 వినియోగదారులు మాత్రమే ఓటీఎస్ కింద బిల్లులను చెల్లించినట్లు జీఎం సంతోష్ కుమార్ చెబుతున్నారు. స్కీమ్ పూర్తిగా ఉపయోగించుకుంటే దాదాపుగా రూ.23 కోట్ల వరకు బకాయిలు జలమండలి ఖజానాకు చేరుకుంటాయి.

సెక్షన్ల వారీగా ఓటీస్ అర్హుల జాబితాలో ఓటీఏ ద్వారా చెల్లించని వారి వివరాలు, వసూలైన బకాయిల మొత్తం ఇలా ఉన్నాయి.

సెక్షన్	కన్స్యూమర్స్	ఓటీస్ అర్హులు	చెల్లింపులు	బకాయిలు
రాధిక	9538	3345	153	6.19
హౌసింగ్ బోర్డు	8987	4120	180	6.96
సాయిబాబానగర్	7245	2533	105	5.08
చర్లపల్లి	8617	3791	144	25.59
నాచారం	10641	5742	259	33.73
హబ్సిగూడ	6495	2065	154	11.89
ఉప్పల్	13711	7026	464	13.89
రామంతాపూర్	11849	5140	367	12.02
మొత్తం	77083	33762	1826	115.35

ప్రత్యేక డ్రైవ్ చేపడతాం..



అర్హులైన వారు ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఇప్పటి వరకు కొంతమంది వినియోగదారుల మాత్రమే స్పందించారు. చాలా వరకు స్కీమ్ గురించి తెలియని వారు ఉన్నారు. వారికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి డివిజన్‌లో స్కీమ్‌ను విజయవంతం చేయడానికి కృషి చేస్తాం. – జీఎం. సంతోష్‌కుమార్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం సబ్‌స్టేషన్ 33/11 కేవీ పరిధిలోని ముత మెటెల్ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నాచారం ఐడీఏ పారిశ్రామిక వాడలోని రోడ్డు నెంబర్ 9,12లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి 4.30 వరకు రోడ్ నెంబర్ 7,8 లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు ప్రకటించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఉప్పల్ కురుమ సంఘం ఎన్నికలు

ఉప్పల్: ఉప్పల్ కరుమ సంఘం ఎన్నికలు ఆదివారం ఉప్పల్ బీరప్పస్వామి దేవాలయంలో జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు బీరప్పగడ్డలోని స్వామివారి దేవాలయ ప్రాంగణంలో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కురుమ యువత, మహిళా కమిటీ, ఉద్యోగ కమిటీ, పంచాయితీ కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల అధికారులుగా గొరిగే కృష్ణ, ప్రొ. రామాంజనేయులు, డాక్టర్ కంకల్ల ఎలేందర్‌లు వ్యవహరించనున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ భగవాన్‌కాలనీకి చెందిన నాగరాజ మోహన్‌కి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2,20,000 ఎల్‌ఓసీ చెక్కును శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

కీసర: మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 6, 16, 20 వార్డుల్లో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో మంజూరైన రూ. 38 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆరో రోజు గ్రూప్ -1 ప్రశాంతం

మల్కాజిగిరి: గ్రూప్ – 1 మెయిన్స్ మల్కాజిగిరిలోని 2 సెంటర్లలో ఆరో రోజు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 1394 మంది అభ్యర్థులకు 915 మంది హాజరు కాగా.. సెంటర్ –1లో 132 మంది, సెంటర్ 2లో 347 మంది గైర్హాజరయ్యారు. దివ్యాంగ అభ్యర్థుల్లో 136 మందికి 93 మంది హాజరు కాగా, సెంటర్– 1లో 7 మంది, సెంటర్ 2లో 26 మంది పరీక్షకు హాజరు కాలేదు.

బీజేపీ సీనియర్ నేత మృతి

నివాళులర్పించిన ప్రముఖులు



వెంకటేష్ (ఫైల్)



నివాళులర్పించిన ఎంపీ ఈటల, బీజేపీ కార్పొరేటర్లు

మల్కాజిగిరి: బీజేపీ పార్టీ సీనియర్ నాయకుడు మల్కాజిగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డీఎస్.వెంకటేష్(62) మృతి చెందారు. రెండ్రోజుల క్రితం ఛాతీలో నొప్పి రావడంతో ఈసీఐఎల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆయన మృతి చెందారని కుటుంబసభ్యులు తెలిపారు. మల్కాజిగిరి పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడిగా పలు బాధ్యతలను నిర్వహించారు. ఆయన సతీమణి డీఎస్ లీలావతి గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసిన డీఎస్ వెంకటేష్ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని ఆయన కుటుంబానికి పలువురు నేతలు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, బీజేపీ కార్పొరేటర్లు శ్రవణ్, రాజ్యలక్ష్మి, సునీతాయాదవ్, పార్టీ సీనియర్ నేతలు ఆర్‌కే. శ్రీను, నర్సింహాగౌడ్, రాంబాబు, ఆనంద్ తదితరులు నివాళులర్పించారు.

నియామకం



నియామకపత్రాన్ని అందుకుంటున్న మహేష్‌యాదవ్

మల్లాపూర్: అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శిగా నాచారానికి చెందిన పరకల మహేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బద్దుల బాబురావు, యువజన విభాగం అధ్యక్షులు గోర్ల యశ్వంత్‌రాజ్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందుకున్నారు. మహేష్‌యాదవ్ మాట్లాడుతూ.. యాదవ సోదరుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. అఖిల భారత యాదవ బలోపేతానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్‌యాదవ్, శ్రీహరియాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రాగేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం హెచ్‌ఎంటీనగర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. శనివారం శ్రీపుష్పయాగం ఏకాంత సేవలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పాల్గొన్నారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ఆలయ ప్రధాన అర్చకులు వేంకటేశ్వరచార్యులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో ఓరియంటేషన్ డే



కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఓరియంటేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో బిగ్‌సీ మొబైల్స్ హెచ్‌ఆర్ రాంమోహన్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, పరిశ్రమ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కృషి చేయాలన్నారు. పలు అంశాలు, వారి అనుభవాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్‌బాబు, ఎంబీఏ హెచ్‌ఓడీ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు..



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం హెచ్‌ఎంటీనగర్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను శనివారం నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మరో 4 రోజుల్లో తొలగింపు పనులు పూర్తవుతాయన్నారు. గుర్రపు డెక్కను ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ ఎంటమాలజీ అధికారులను ఆదేశించారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహా, బీఆర్ఎస్ నేతలు మేకల ముత్యంరెడ్డి, విఠల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనే ముక్తికి మార్గం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు, అనుగ్రహ ప్రవచనంలో బాల బ్రహ్మానంద సరస్వతీ స్వామి

మల్కాజిగిరి: సమాజ శ్రేయస్సును కోరుతూ భగవంతుని అనుగ్రహం కోసం ఆధ్యాత్మిక చింతన ఉత్తమమైన మార్గంగా నిలుస్తుందని నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతీస్వామి అన్నారు. శనివారం ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో వేంకటేశ్వర లీలావిన్యాసంపై ప్రవచన కార్యక్రమం జరిగింది. కలియుగ ప్రత్యక్ష దైవంగా తిరుమలలో ఉండి లోకాన్ని రక్షిస్తూ.. భక్తుల కోరికలు తీర్చే దేవుడిగా స్వామివారు నిలిచారన్నారు. ఆలయ ఈఓ రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీ రమణాచార్యులు, కొండపాక వేణుగోపాలాచార్యులు, క్లర్క్ సుధాకర్ భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



నమూనాలను తిలకిస్తున్న ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త మహేష్‌కుమార్



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్

పోచారం: ఆధునిక సమాజంలో విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నామని జాతీయ పోషణ సంస్థ 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్' శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ కుమార్ ముమ్మడి అన్నారు. శనివారం యంనంపేట్‌లోని రాక్ ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రపంచ మేథో మిళిత సంభాషణ 'కొలోక్వియమ్ ఫ్యూజన్ ఆఫ్ గ్లోబల్ ఇంటెలెక్' పేరుతో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నేలకోత, అంతరిక్షం, స్మారక చిహ్నాలు, పక్షులు మొదలైన నమూనాలను వీక్షించి, విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రపంచ మేధస్సును పరిశోధించి, తమదైన రీతిలో నమూనాలను రూపొందించి వైవిధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో ఫ్యూచర్ డాట్స్ కో–ఫౌండర్ పవన్‌కుమార్, స్కూల్ చైర్మన్ మీనిగె రామన్‌నాయుడు, సీఈఓ రంగినేని సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ దివ్యశర్మ, ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంజని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు కేటీఆర్ పర్యటన

మల్లాపూర్: నాచారం హెచ్‌ఎంటీనగర్ పెద్ద చెరువుపై నిర్మించిన ఎస్టీపీ పనితీరును పర్యవేక్షించడానికి ఆదివారం ఉదయం 8 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రానున్నట్లు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

అల్వాల్: ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం ప్రేమ్‌నగర్ కాలనీలో నివసించే శివరాంప్రసాద్, కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. కాగా పుట్టినరోజు వేడుకల సందర్భంగా రాజమండ్రికి వెళ్లి తిరిగి ఇంటికొచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని రూ.15 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



విద్యార్థినితో ప్రిన్సిపాల్ నీలిమాదేవి

బోడుప్పల్: అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ బోడుప్పల్ బ్రాంచిలో శనివారం గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ అండ్ టెక్నాలజీ కౌశిక్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. కుటుంబానికి పెద్దవారి సహకారం పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందన్నారు. పాఠశాల బచపన్ విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ వేడుకలకు విద్యార్థుల అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు పాల్గొని చిన్న పిల్లలుగా మారి వారితో కలిసి సందడి చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ సునీత, ప్రిన్సిపాల్ నీలిమాదేవి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



కలియ పాత్రో

కుషాయిగూడ: వ్యక్తి అదృశ్యమైన ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి బీఎన్‌రెడ్డినగర్‌లో నివసించే రామచంద్ర పాత్రో, శాంతిలతకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు కలియ పాత్రో (23)కి మతిస్థిమితం సరిగ్గాలేదు. ఈనెల 25న మధ్యాహ్నం భోజనం చేసి వాకింగ్ చేస్తానని బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్కారం



ప్రొ. పురుషోత్తంను సత్కరిస్తున్న టీజేఎస్ నేతలు

అల్వాల్: రాష్ట్ర ప్రభుత్వ విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తంను శనివారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా టీజేఎస్ నేతలు కలిసి సత్కరించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా టీజేఎస్ నేతలు ఏర్పుల దయాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు దయాకర్‌గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

చికెన్ ప్రాసెసింగ్ యూనిట్‌కు వ్యతిరేకంగా రైతుల నిరసన



మాంసం ప్రాసెసింగ్ యూనిట్‌లో పేరుకుపోయిన చికెన్ వ్యర్థాలు

కీసర: పంట పొలాల మధ్య అక్రమంగా నిర్వహిస్తున్న మాంసం(చికెన్) ప్రాసెసింగ్ యూనిట్, దాని నుంచి విడుదలవుతున్న కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కీసరరెడ్డిగూడెం, నూకలగూడెంకు చెందిన రైతులు కీసరరెడ్డిగూడెంలోని యూనిట్ వద్ద ధర్నా నిర్వహించారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి కీసర నుంచి నూకలగూడెం వెళ్లే రహదారిలో ఓ పౌల్ట్రీఫామ్‌ను లీజుకు తీసుకుని అందులో బాయిలర్ కోళ్ల మాంసం ప్రాసెసింగ్‌ను నిర్వహిస్తున్నాడు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు చికెన్ కటింగ్ చేసి వాటి నుంచి వచ్చే వ్యర్థాలను పరిసర ప్రాంతాల్లోని పొలాల్లోకి వదులుతున్నాడని రైతులు ఆరోపించారు. దీంతో దుర్వాసనతో రోగాలు ప్రబలుతున్నాయని వాపోయారు. దీనిపై యూనిట్ నిర్వాహకులను ప్రశ్నించినా ఫలితం లేదన్నారు. అనంతరం మాంసం ప్రాసెసింగ్ యూనిట్‌ను తొలగించాలని కోరుతూ దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణికి ఫిర్యాదు చేశారు. ఈ విషయం గురించి మున్సిపల్ కమిషనర్ నాగమణిని వివరణ కోరగా.. తమ సిబ్బంది యూనిట్‌ను సందర్శించారని, త్వరలో దీనిపై తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. 'ట్రస్ట్ ది మ్యాజిక్ ఆఫ్ ది బిగినింగ్ ' పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌లో మొదటి రోజు మానీష్ మిశ్రా, రెండోరోజు రాజేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉప్పల్: మత్తు పదార్థాల నిర్మూలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఉప్పల్ ఎస్సైలు మధు, రఘురాంలు అన్నారు. శనివారం ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ ఆధ్వర్యంలో ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రగ్స్ నిర్మూలన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రగ్స్ లాంటి మహమ్మారిని తరిమి కొట్టాలంటే ప్రజలు, యువత సహకారం అవసరమన్నారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్ ప్రదీప్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి బీఎస్.కృష్ణ మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలను తమ వంతు సహకారం అందిస్తామని, నియంత్రించడంలో పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.



దరఖాస్తులకు ఆహ్వానం

ఘట్‌కేసర్: తెలంగాణ సాంఘీక సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ కో–ఎడ్యూకేషన్ గురుకుల పాఠశాలలో 2024–25కి గెస్ట్ లెక్చరర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మధులత ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2–5 గంటల వరకు వారంలో మూడు సార్లు విధులు నిర్వహించాలన్నారు. కూచిపూడి, కథక్, మృదంగం, తబల, వీణ, ఫ్లూట్, వయోలిన్, గిటార్, కీ బోర్డు అంశాలు బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31 లోగా పీఆర్ఐ–ఆర్ఓ–ఎంఎల్‌కేజీఆర్–ఎస్‌ఈబ్ల్యూఆర్ఎస్ తెలంగాణ జీఓవీ.ఇన్ మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు 7995010640 నంబరును సంప్రదించాలన్నారు.

పోలీసుల తనిఖీలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 37 మంది పోలీసులు 5 బృందాలుగా మేడ్చల్ చెక్‌పోస్ట్, కిష్టాపూర్ పూడూర్ చెక్‌పోస్ట్ పారిశ్రామిక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 342 వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు సరైన పత్రాలు లేని 32 వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.